క్లుప్తంగా

ఘనంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలో ఆషాఢ మాసం సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. తోట భోగయ్య, చిలుకూరి రామకృష్ణ చౌదరి, ముత్యాల రామారావు, ఇంటి సత్యనారాయణ, ముత్యాల అంజి, చోటిశెట్టి కిరణ్, ముత్యాల అయ్యప్ప, వలవల సాయి, యర్రా లక్ష్మణ జ్యోతి స్వారుప్, మెంటేవారి తోట యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బండి శ్రీనివాసరావు


బండి శ్రీనివాసరావు

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామానికి చెందిన బండి శ్రీనివాసరావు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకల సేవ సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ప్రస్తుతం అసిస్టెంట్ పోస్ట్మాస్టర్‌గా భీమవరం నందు విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకల సేవా సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చాలా మల్లేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆదివాసీ ఎరుకల హక్కుల కొరకు, అణగారిన ఎరుకుల కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కొరకు తన శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకి ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాస రావును వివిధ జిల్లాల అధ్యక్షులు అభినందించారు.

బాలా త్రిపుర సుందరీదేవికి వెండి సమర్పణ

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారికి దాతలు ఆదివారం 100 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన తవ్వా గురునాథం, వెంకట నాగలక్ష్మి దంపతులు 100 గ్రాముల వెండి విరాళం ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఆలయ అర్చకులు దాతలకు పూజలు చేసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే సహించేది లేదు


భీమవరం టుటౌన్ పోలీసు స్టేషన్ వద్ద రౌడీషీటర్స్‌కు కౌన్సిలింగ్ ఇస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే సహించేది లేదని టూటౌన్ సీఐ జి కాళీచరణ్ హెచ్చరించారు. పట్టణంలోని పలువురు రౌడీ షీటర్స్‌కు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఎక్కడైనా గొడవలకు దిగినా, బహిరంగంగా మద్యం సేవించినా సహించేది లేదని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో బయట తిరగవద్దని సూచించారు.

కోట శ్రీనివాసరావు మరణం తీరని లోటు

భీమవరం (ప్రకాశంచౌక్): కోట శ్రీనివాసరావు మరణం తీరని లోటని పలువురు వక్తలు తెలిపారు. మావుళ్లమ్మ అమ్మవారి 37వ వార్షిక మహోత్సవంలో ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావుకు నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో సువర్ణ హస్తా కంకణంతో ఘన సన్మానం చేశారు. ఆయన మృతికి పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు. భీమవరంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

రోడ్లపైనే మురుగునీరు


కొత్తపూసలమర్రు - గూట్లపాడులో రోడ్డు మీద నిలిచి పోయిన కలుషిత నీరు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని కొత్తపూసలమర్రు- గూట్లపాడు గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపైకి వనామీ రొయ్యల చెరువులోని కలుషిత నీరు వస్తున్న ఆ శాఖ అధికారులు కాని పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామాల మధ్య రోడ్డును ఆనుకుని ఉన్న రొయ్యలు, చేపలు చెరువుల నీరు దిగువకు ప్రవహించే మురుగు డ్రైయిన్‌లు పూడుకుపోయాయి. దీంతో ఆ చెరువుల నీరు రోడ్డుపైన ఉండటంతో రోడ్డు ధ్వంసమవుతుంది. అంతే కాకుండా ప్రక్కనే ఉన్న పంటకాలువల్లోకి వెళ్తుండటం, దిగువన ఉన్న కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాలలో రక్షిత మంచినీటి చెరువులకు తాగునీరు పెడుతున్నారని ఇలా పంట కాలువల్లో కలుషిత నీరు కలిసి పోవడంతో దిగువ గ్రామస్తులు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారంతా కంపు.. పట్టదు ఎందుకు

- మండల కేంద్రంలో లోపించిన శుభ్రత
- ఎల్ఎన్‌పురంలో ఎక్కడి మురుగు అక్కడే



ఎల్ఎన్ పురం గ్రామంలో మురుగు నీరు పారుతున్న దృశ్యాలు

కాళ్ల: మండల కేంద్రం ఎల్ఎన్‌పురం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితులకు తోడు పారిశుద్ధ్య సమస్యతో రోగాలు వ్యాప్తి చెందుతాయని అంతా భయపడుతున్నారు. ఎల్ఎన్‌పురంలో ఎక్కడ చూసినా మురుగు నీరే కనిపిస్తుంది. చివరికి సచివాలయానికి వెళ్లాలన్నా మురుగునీరు దాటుకునే వెళ్లాలి. ఇళ్లలో మురుగునీరు నేరుగా ప్రధాన రహదారి పైకి వదిలేస్తున్నా పట్టించుకునే వారే లేరు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీధుల్లో దుర్గంధం వస్తున్నా కనీసం బ్లీచింగ్ చల్లేవారు లేరని, రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం అంతా ఇదే పరిస్థితి ఉన్నా కనీసం అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రధాన సెంటర్లో అయితే మురుగునీరు రహదారి మధ్య నుంచి నేరుగా పంటకాలువ లోనికే వెళ్తున్నాయి. ఆ నీటినే మళ్లీ మంచినీటి చెరువులోకి విద్యుత్ మోటార్లతో నింపుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి కలుషితనీరు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకొనే అధికారి లేకపోవడం విచారకరం. దీనిపై మండల స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భీమవరం: న్యూ ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని భీమవరం, బీ.వీ.రాజు, వీరమ్మ పార్కు నందు నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డీఎస్.రాజు (భీమవరం), ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాసిం, గౌరవ అధ్యక్షుడిగా డి. జానీ, జిల్లా అధ్యక్షుడిగా బంగారు వినోద్‌లు నియమితులయ్యారు. వీరితోపాటు రాష్ట్ర అసోసియేషన్లో ఉపాధ్యక్షుడిగా మూర్తి, కోరాడ శ్రీను, సంయుక్త కార్యదర్శిలుగా కట్టా శ్రీను, రామకృష్ణ, లీగల్ సెల్ చైర్మన్‌గా ఇంజేటి వెంకటేశ్వర్లు, కన్వీనర్‌గా బొల్లా శ్రీను, ఆర్గనైజింగ్ విజయ్‌లు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, కార్మూరి నరసింహమూర్తి బాబు, షేక్ పాదుషా, ఎస్ కే బాజీ, కోడే రాజు, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ మాస సారె


పెదకాపవరం గ్రామంలోని పల్లాలమ్మ అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న మహిళలు


విశేష అలంకరణలో ఆకివీడు పెద్దింటి అమ్మవారు


అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులతో పాటు సారె సమర్పించడం ద్వారా గ్రామాలు సౌభాగ్యంగా ఉంటాయని మహిళలు నమ్ముతూ అమ్మవారికి ఊరేగింపుగా తీసుకువెళ్లి సారెను సమర్పిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆషాఢమాస సారెలతో హోరెత్తింది. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని పల్లాలమ్మ అమ్మవారికి ఊరు ఆడపడుచులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పెద్దింటి అమ్మవారికి, మాదివాడలోని పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు సారె సమర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామ దేవతలకు ఆషాడం సారె సమర్పణ

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామ దేవతలైన గరవల్లమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు ఆదివారం ఆషాడ మాస సారె సమర్పించారు. గ్రామంలో కోదండరామాలయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వివిధ రకాల స్వీట్స్, పండ్లను మహిళలు, భక్తులు చేతబట్టి అమ్మవార్లకు సమర్పించారు. గ్రామ ప్రముఖులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దొరగారి చెరువు తవ్వకం పనులు ప్రారంభం


స్థానిక ప్రధాన సెంటర్‌లోని దొరగారి చెరువు తవ్వుతున్న దృశ్యం

- ఊపిరి పీల్చుకుంటున్న ఆక్రమణదారులు

ఆకివీడు: స్థానిక ప్రధాన సెంటర్‌లోని దొరగారి చెరువు పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా చెరువులోని నీటిని బయటకు తోడి ఎండగట్టారు. వర్షాల కారణంగా తవ్వ పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం చెరువులోని పూడిక మట్టిని గట్టువారకు చేవేసే పనులు చేస్తున్నారు. గత ఏడాది చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా పూడిక తీత పనులు ప్రారంభించారు. చెరువు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 60 లక్షలు రెండేళ్ల క్రితం మంజూరయ్యాయి. చెరువు ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్, పూడిక తీత పనులు తదితర పనులతో చెరువును ఆహ్లాదకరంగా అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. అయితే కొంత సొమ్ము వెచ్చించి వాకింగ్‌ట్రాక్, చెరువులో చెత్త, పూడిక తొలగింపు, ఫెన్సింగ్ వంటి పనులను చేసి, సంబంధిత కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. ప్రస్తుత పూడిక తీత పనులకు నగర పంచాయతీ నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిసింది.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


పీవీఎల్‌ను సత్కరిస్తున్న నాయకులు

కాళ్ల: మండలంలో వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుర్రం జార్జి బెన్‌హర్ నియమించడం అభినందనీయమన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం అమెరికా ప్రయాణం ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన పీవీఎల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జువ్వలపాలెం వైఎస్సార్ సీపీ ఉండి నియోజవర్గం పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు కటారి లక్ష్మీపతి రాజు, కాళ్ల మండలం యూత్ అధ్యక్షుడు, ముదుండి సురేష్ రాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొండేటి శివకుమార్, జువ్వలపాలెం గ్రామ ఎంపీటీసీ మీసాల శ్రీనివాస్, జువ్వలపాలెం వార్డు నెంబర్ బోధనపు కన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, గాతల సందీప్, బోధనపు చిన్న కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పొలం తగాదాలో వాగ్వాదాలు


వీరవాసరం పోలీస్ స్టేషన్ వద్ద ఘర్షణ పడుతున్న దృశ్యం

వీరవాసరం: పొలం తగాదా విషయమై పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్సై సమక్షంలోనే బెదిరింపులకు, వాగ్వాదాలకు పాల్పడిన సంఘటన ఆదివారం వీరవాసరం పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. ఉనికిలి గ్రామానికి చెందిన వట్టికూటి సుబ్రహ్మణ్యం, ఆరవల్లి గ్రామానికి చెందిన రెడ్డిలకు గత కొంతకాలంగా అండలూరు గ్రామంలో ఉన్న తమ వరి పొలాల వద్ద సరిహద్దు తగాదాలు ఉన్నాయి. వీరు ఇరువురు గతంలో వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల వద్ద పొలం తగాదా విషయమై అర్జీలు చేసుకోవడం జరిగింది. ఇదే సంఘటనపై ఇరువురు వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడంతో వీరవాసరం ఎస్సై రాజ్ కుమార్ ఆదివారం సరిహద్దు తగాదా సంఘటన పై వీరవాసరం ఎస్సై రాజ్ కుమార్ వివరాలు సేకరిస్తుండగా వట్టికూటి సుబ్రహ్మణ్యంతో పాటు అతనితో వచ్చిన మరి కొంతమంది కలిసి తగాదాకి దిగారు. పోలీసులు ఎంత వారిస్తున్న ఇష్టానుసారం మాట్లాడుతూ ,బెదిరింపులు చేస్తూ తగాదా పడడంతో రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు సైతం ఆగి మరి చూస్తూ ముక్కుని వేలేసుకున్నారు. స్టేషన్ వద్ద ఇటువంటి గలాటా ఏమిటి అంటూ చెవులు కొరుక్కున్నారు.

ఎంఆర్ ఆశయసాధనకు కృషి చేయాలి


సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సత్యనారాయణ, తదితరులు

కాళ్ల: పద్మశ్రీ డాక్టర్ ఎం.ఆర్.రాజు ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజులు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని మహాత్మాగాంధీ మెమోరియల్ ట్రస్టు భవనంలో నిర్వహించిన పద్మశ్రీ డాక్టర్ ముదుండి రామకృష్ణంరాజు (ఎం.ఆర్.రాజు) స్మృత్యంజలి సభలో వారు పాల్గొని మాట్లాడారు. సభకు పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించి, క్యాన్సర్ వ్యాధిపై అమెరికాలో పరిశోధనలు చేసి, స్వగ్రామం పెదఅమిరంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సుమారు 4 దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించి చిరస్మరణీయులయ్యారని అన్నారు. ఆయన ఆశయసాధనకు అనుగుణంగా ఎంజీఎం ట్రస్టు ద్వారా వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా కేంద్రం భీమవరంలో సైన్స్ పార్కు ఏర్పాటు చేసి దానికి డాక్టర్ ఎం.ఆర్.రాజు పేరు పెట్టాలని సర్వోదయం మండలి తరపున వినతి పత్రాన్ని ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఈసభలో ఎం.ఆర్.రాజు కుమారులు మంతెన రామకుమార్ రాజు, దంతులూరి రంగరాజు, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఎంవీఎస్ రాజు, ప్రొఫెసర్ ఎస్.ఆర్.పరిమి, పలువురు డాక్టర్లు,పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి హిందువు చేతిలో భగవద్గీత ఉండాలి


చిన్నారులకు మెమొంటోలు, ప్రసంశా పత్రాలు అందజేసిన దృశ్యం

ఆకివీడు: ప్రతి హిందువు చేతులో భగవద్గీత ఉండాలని, ప్రతీ ఇంట్లో గీత, రామాయణ, మహాభారతాలుండాలని ఉత్తమ ఉపాధ్యాయులు, ఆధ్యాత్మికవేత్త తెన్నేటి లక్ష్మీ నర్సింహమూర్తి అన్నారు. స్థానిక మాదివాడ దేవాలయాల ప్రాంగణంలో ఆదివారం హైందవ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. పోటీల్లో 70 మంది చిన్నారులు పాల్గొన్నారు. విద్యార్థులకు మూడు విభాగాలుగా పోటీలు నిర్వహించారు. రామ సమూహంలో మొదటి మూడు బహుమతులను మనస్వివి, టీ.కార్తీక సాయి, వీ.చేతన, సీతా సమూహంలో జీ.తేజస్వి, పీ.షణ్ముఖ ధనుశ్రీ, రుషిక, లక్ష్మణ సమూహంలో జే.నందిని, టీ.గీతావైష్ణవి, బీ.హేశ్రీలు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు నాగ శశికళ చెప్పారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా తెన్నేటి మాస్టార్, అడ్వకేట్ నెల్లి సతీష్, చిర్రావూరి సూర్యనారాయణమూర్తి, రీడర్స్‌ఫోరం అధక్షులు డీవీ.సత్యనారాయణ, చొప్పెర్ల మూర్తి, లంక జలదుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకర్లకు సత్కారం


బాలేపల్లిలో ర్యాంకర్లకు సత్కారం చేస్తున్న దృశ్యం

వీరవాసరం: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన తమ మిత్రుని కుమారులను 1986–87 వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన పదో తరగతి మిత్ర బృందం ఆదివారం సత్కరించింది. బాలేపల్లి గ్రామానికి చెందిన పాలా శ్రీనివాసరావు, జయశ్రీ కుమారులు రోహిత్ పాలీసెట్ 2025 రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు, మరో కుమారుడు రోహన్ ఏపీ ఆర్‌జె సి 2025లో 227 ర్యాంకు సాధించారు. భీమవరం తిరుమల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన వీరు అదే కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఐఐటి లక్ష్యంగానే ముందుకు సాగుతున్నట్టు రోహిత్, రోహన్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యేలూరి భాను కుమారి, వలవల జానకిరామ్, ముద్రగడ శ్రీనివాసరావు, నిమ్మల దుర్గ, గునిశెట్టి మంగతాయారు, చల్లాయమ్మ, పంతం రాము, కోరసిక వీర్రాజు, ఆర్‌కె నాయుడులు పాల్గొన్నారు.

బ్రహ్మారాజుకు అభినందనలు

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కలిదిండి బ్రహ్మారాజు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ ఇంజనీర్స్(ఐఐపి ఈ) జాతీయ స్థాయి హానరరీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీన బెంగళూరులో జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈయనను ఎన్నుకొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల యాజమాన్యం తరఫున కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గతంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) (ఐఈఐ) జాతీయ కౌన్సిల్ సభ్యునిగా కూడా పని చేసి పలు దేశాలు కూడా సాంకేతిక పర్యటన జరిపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మరాజును పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


స్వామివారికి రెండున్నర కిలోల వెండి కిరీటం అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని జెపి రోడ్డులో పద్మావతి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి చందన అలంకరణ చేశారు. 10న రాత్రి 7.30 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మచే స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, ఎమ్మెల్యే అంజిబాబు దంపతులు పట్టు వస్త్రాలను అందజేస్తారని ఈవో సత్యనారాయణ రాజు తెలిపారు. అలాగే స్వామివారికి దాతలు రెండున్నర కిలోల వెండి కిరిటాన్ని అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, ప్రవీణ్ కుమార్, భగత్ సింగ్, ప్రసాద్, ఆకుల కృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం: మండలంలోని 33 కెవి కొనితివాడ సబ్‌స్టేషన్‌కు భీమవరం నుంచి కొత్తలైన్ వేయటం నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతున్నట్లు విద్యుత్ ఏఈ అప్పారావు ఆదివారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు వీరవాసరం మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని కొనితివాడ, మడుగు పోలవరం నేలపోగుల, పోలమూరు ఇండస్ట్రియల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకోడేరు: భీమవరం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడులలో పాలకోడేరు మండలం, మొగల్లు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎ.లక్ష్మీ గణేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడులలో ఎస్ఐలు పి.ఉమామహేశ్వర రావు, పి. సునీల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం సీఐ కె.బలరామరాజు తెలిపారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలు


ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న దృశ్యం

భీమవరం: బొండా సుబ్బారావు 11వ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం (త్యాగరాజ భవనం) నందు నంబూరు శ్రీ కాశీ వన ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ చంద్ర కాశీ ప్రసాద మాతాజీ శిష్యులు శ్రీనివాస రామానుజ దాస్ గారిచే మహాభారతంలోని మధుర ఘట్టాలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభ కార్యక్రమాన్ని భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గతించిన తండ్రి బొండా సుబ్బారావు వర్ధంతిని ప్రతి ఏటా ఆధ్యాత్మిక కార్యక్రమాలుగా నిర్వహిస్తున్న బొండా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బొండా సత్యనారాయణ మూర్తి, బొండా సత్య కిషోర్, వబిలిశెట్టి కనకరాజు, మానేపల్లి సూర్యనారాయణ గుప్తా, కార్మూరి సత్యనారాయణ, డీవీఎస్ చంద్రజి, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.